మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి స్వామివారి ప్రసాదం అందజేస్తున్న వెంకటయ్య, బాలు

యాదగిరిగుట్ట, మార్చి 15 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కర్రె వెంకటయ్య, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి స్వామివారి ప్రసాదం అందజేశారు. యాదగిరీశుడి ఆశీస్సులు ఉండాలని వారు ఆకాంక్షించారు.

విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని పెంచాలి : కలెక్టర్

జమీలాపేటలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై వివరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

బీబీనగర్, మార్చి 15 : విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరిగేందుకు మంచి విద్యను, సలహాలు అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని జమీలాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సపోర్ట్‌తో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాంను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి సూచనలు, సలహాలు ఇవ్వడం ద్వారా వారికి అవగాహన కలిగి జ్ఞాపకశక్తి పెరిగి చదువులో ముందుంటారన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదుగాలని సూచించారు. అనంతరం రాయరావుపేట గ్రామంలో మురుగు నీటి సమస్యను పరిశీలించారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు గ్రామ మాజీ సర్పంచ్ బొర్ర సంతోష రమేశ్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో ఏఎంఓ శ్రీనివాస్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సురేశ్‌రెడ్డి, నర్సింహ, విజయ్‌కుమార్, ఏఎపీసీ చైర్మన్ సునీత, నాయకులు సుభాశ్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, పాండురంగంగౌడ్ పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో తల్లిదండ్రుల సంరక్షణ పిల్లలదే : ఆర్డీఓ

తల్లిదండ్రుల సంరక్షణ చట్టం కేసులను విచారిస్తున్న ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్, మార్చి 15 : వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనని ఆర్డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శనివారం తల్లిదండ్రుల పోషణకు సంబంధించి వచ్చిన పలు కేసుల విచారణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా వారి ఆస్తులను పిల్లలు అనుభవిస్తే రద్దు చేసే అవకాశం ఉందన్నారు. పిల్లల నిర్లక్ష్యంపై తమ దృష్టికి వచ్చిన కేసులను విచారించి సరైన నిర్ణయం తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేందర్ శర్మ, న్యాయవాది ముత్యాల సత్తిరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్

సదస్సులో మాట్లాడుతున్న వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్

బొమ్మలరామారం, మార్చి 15 : విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకొని, మోసాలకు గురికాకుండా ఉండాలని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు కొడారి వెంకటేశ్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని మేడిపల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి వస్తువు కొనుగోలు చేసినప్పుడు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ చెల్లించరాదని, వస్తువు తయారు చేసిన తేదీ, పనిచేసే తేదీ, బ్యాచ్ నెంబర్ చుసుకోవాలని అన్నారు. వస్తువు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా దానికి సంబంధించిన బిల్లును అడిగి తీసుకోవాలని సూచించారు. 1986 మరియు 2019 వినియోగదారుల హక్కుల రక్షణ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం వినియోదారులను చైతన్యపరిచే వినియోగదారుల హక్కుల కరపత్రం విడుదల చేశారు. సమావేశంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు జిట్టా భాస్కర్‌రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బోగ గణేశ్, ఉపాధ్యాయులు సత్తయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం

మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

వలిగొండ, మార్చి 15 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని పులిగిల్ల గ్రామంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులను చేయూత ఫౌండేషన్, కంది శశిధర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సంధ్య, కార్యదర్శి సైదులు, చేయూత ఫౌండేషన్ చైర్మన్ వాకిటి రాంరెడ్డి, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, గణపతిరెడ్డి, మాధవి, హైమావతి పాల్గొన్నారు.

ఎండిపోయిన పాలాల పరిశీలన

ఎండిన పంటలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు(ఎం), మార్చి 15 : మండలంలోని పోసానికుంట గ్రామంలో నీళ్లు లేక ఎండిపోయిన వరి పొలాలను సీపీఎం నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం మాట్లాడుతూ కరువు మండలంగా ప్రకటించి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షుడు తుమ్మల సత్యనారాయణ రెడ్డి, ఐలయ్య, నర్సయ్య, వెంకట్‌రెడ్డి, రాములు, జయమ్మ, పద్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలి : సీఐటీయూ

రామన్నపేట, మార్చి 15 : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ గొరిగె సోములు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీమొబైల్ సెంటర్స్ మరియు నూతన జాతీయ విధానాన్ని తక్షణమే ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16, 17 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించే వంటావార్పు, ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, నకిరేకంటి రాము, అంగన్‌వాడీ టీచర్స్ సంఘం మండల అధ్యక్షురాలు గురుకు లలిత, సువర్ణ, రేణుక పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం) : ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భూదాన్ పోచంపల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

రైతుల గోస తీర్చాలని అడిగితే సస్పెన్షన్ చేస్తరా?

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై పలు చోట్ల నిరసనలు

భువనగిరి అర్బన్, మార్చి 15 : రైతులు గోస పడుతున్నారు.. వారి సమస్యలు తీర్చాలని అసెంబ్లీలో ప్రశ్నించిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని సస్పెన్షన్ చేస్తారా? ఇది హేయమైన చర్య అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ పట్టణంలోని ప్రధాన రహదారిలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్త బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు కంటనీరు తప్ప ఎలాంటి లాభం జరుగలేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, పంటలకు నీరందించడంలేదని విమర్శించారు. వరి పొలాలు ఎండిపోతుంటే రైతులు ఏడుస్తూ అరిగోస పడుతున్నారని, వారి పక్షాన మాట్లాడడం తప్పా? అని ప్రశ్నించారు. పంటలు ఎండిపోతున్నా పట్టించుకోని ప్రభుత్వాన్ని నిలదీస్తామని, రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలకు, రైతులకు ఎంత నష్టం చేస్తుందో కండ్లకు కనిపిస్తున్న నిజాన్ని అసెంబ్లీలో చర్చించడం తప్పా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొలుపుల అమరేందర్, నోముల పరమేశ్వర్‌రెడ్డి, ఎడ్ల సత్తిరెడ్డి, ఎనబోయిన ఆంజనేయులు, బీరు మల్లయ్య, ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, శ్రీనివాస్‌రెడ్డి, ఓం ప్రకాశ్‌గౌడ్, లక్ష్మీనారాయణ, నర్సిరెడ్డి, శ్రీనివాస్, శంకర్, గోపాల్, సురేశ్, పాండు, రఘునాథ్, వీరేశ్, జంగయ్య, పద్మ, నితీశ్, లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజద్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎం)లో రాస్తారోకో

ఆత్మకూరు(ఎం) : సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని మోత్కూర్ – భువనగిరి ప్రధాన రోడ్డుపై బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, నాయకులు ఉప్పలయ్య, ఇంద్రారెడ్డి, భిక్షపతి, వెంకటేశ్, కవిత, అరుణ, దశరథగౌడ్, సైదులు, నాగరాజు, నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకన్న, లింగయ్య పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

బొమ్మలరామారం : ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ హామీలను అమలు చేయాలని అసెంబ్లీలో నిలదీసినందుకు సస్పెన్షన్ చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్ష నేతలపై తప్పుడు ఆరోపణలు చేస్తూ అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గూదె బాలనర్సింహ, సుధీర్‌రెడ్డి, బండి మహేశ్ గౌడ్, నవీన్, మల్లేశ్, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

బీబీనగర్ : ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు అన్నారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలోని ప్రధాన కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపినందుకు ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు గాదె కవిత, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లగారి శ్రీనివాస్, బీఆర్ఎస్‌వీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేశ్, నాయకులు రవికుమార్, బాలచందర్, అశోక్, పురుషోత్తంరెడ్డి, శ్రీశైలం, లింగయ్యగౌడ్, ఐలయ్య, రమేశ్, వంశీగౌడ్ పాల్గొన్నారు.

మోటకొండూరులో నిరసన

మోటకొండూర్ : ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పన్షన్ ఎత్తివేయాలని మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అహంకారంతోనే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసిందన్నారు. నాయకులు బురాన్, వెంకటేశ్, జహంగీర్, మధు, ప్రశాంత్, ఉప్పలయ్య, నాగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

భూదాన్ పోచంపల్లి : ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ పట్టణంలోని నేతాజీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులు చుట్టుముట్టి నీళ్లు చల్లి మంటలను ఆర్పారు. చౌటుప్పల్ చౌరస్తా వద్ద దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నిస్తుండగా ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి వాహనం నుంచి దూకి దిష్టిబొమ్మను ఎత్తుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పోలీస్ జులుం నశించాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాల భూపాల్‌రెడ్డి, నాయకులు బాతుక లింగస్వామి, మల్లారెడ్డి, కుమార్, బాలనర్సింహ, శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, నర్సింహ, బాలయ్య, శ్రవణ్, కిరణ్, సుమన్, విశ్వనాథం, మహిపాల్‌రెడ్డి, పద్మారెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు

సంస్థాన్ నారాయణపురంలో ధర్నా

సంస్థాన్ నారాయణపురం : ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్రి నర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నించిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమన్నారు. నాయకులు సుర్వి యాదయ్యగౌడ్, గడ్డం మురళీధర్‌రెడ్డి, జక్కిడి ధన్వంత్‌రెడ్డి, విద్యాసాగర్, రమేశ్, భిక్షం, చిత్రసేనారెడ్డి, భిక్షపతి, తిరుమలేశ్, గిరి, శ్రీరాములు, శంకర్ పాల్గొన్నారు.

రామన్నపేటలో నిరసన

రామన్నపేట : ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నకిరేకల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు జెట్టి శివప్రసాద్, నాయకులు చిన్నపాక రమేశ్, ఆవుల సత్తయ్య, మహేందర్‌రెడ్డి, చింటు, భగవంతం, చరణ్ పాల్గొన్నారు.

మోటకొండూర్ : నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామన్నపేటలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

బొమ్మలరామారం : రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

రమేశ్ (ఫైల్)

ఆత్మకూరు(ఎం), మార్చి 15 : ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన చామల రమేశ్ (34) శనివారం బైక్‌పై ఆత్మకూరు(ఎం)కు వస్తుండగా మండల కేంద్రంలోని తిమ్మాపురం ఎక్స్‌రోడ్డు వద్ద భువనగిరి నుంచి మోత్కూర్ వైపు వెళ్తున్న హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దాంతో రమేశ్‌కు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

పేకాడుతున్న 19మంది అరెస్ట్

బొమ్మలరామరం, మార్చి 15 : మండలంలోని మల్యాల గ్రామంలో పేకాడుతున్న 19 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని మల్యాల గ్రామ శివారులో ఉన్న గుండు ముత్తయ్య మామిడి తోటలో శుక్రవారం మధ్యాహ్నం తనిఖీ చేయగా.. హైదరాబాద్, యాదగిరిగుట్టకు చెందిన గుండు ముత్తయ్య, కళ్లెం కృష్ణ, లింగాల సతీశ్, ఆరె వెంకటేశ్, చెదుడుపు రాజు, లింగాల సుధాకర్, కంసాని రాము, డీకొండ శ్రీకాంత్, సూదగాని గోపాల్, గడ్డమీది శివలింగం, జగిని విజయ్, గొర్ల నవీన్, గంధం భానుచందర్, పింజరం దినేశ్, చుంచు చంద్రమౌళి, బద్దుల మురళి, గంధమల్ల మనోజ్, ఎండీ జమాల్, చీర సత్యనారాయణ డబ్బులు పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్నారు. వారి వద్ద నుంచి ఆరు బండిళ్ల పేక ముక్కలు, సెల్ ఫోన్లు, 81,290 రూపాయలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఎస్ఐ శ్రీశైలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

'పనిచేసే వారిని ఎన్నుకోవాలి'

వలిగొండ, మార్చి 15 : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల కోసం పనిచేసే నాయకులను గెలిపించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య అన్నారు. మండలంలోని వర్కట్‌పల్లి గ్రామంలో ప్రజా నాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఓటర్లను చైతన్య పరుస్తూ నిర్వహించిన కళాయాత్రలో ఆయన మాట్లాడారు. డబ్బులు, మద్యం పంపిణీ చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజాప్రతినిధులు లేక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, ప్రజా నాట్య మండలి నాయకులు గంటపాక శివ, ఈర్లపల్లి ముత్యాలు, గూడూరు బుచ్చిరెడ్డి, మెట్టు రవీందర్‌రెడ్డి, చేగూరి నర్సింహ, వెంకటేశం, రాదారపు మల్లేశం పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేయాలి : బీఆర్ఎస్

కొలనుపాకలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్

ఆలేరు రూరల్, మార్చి 15 : అసెంబ్లీ సమావేశాల నుంచి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని కొలనుపాక గ్రామంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధపు వాగ్దానాలతో ఆరు గ్యారెంటీలు, వందల హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై అనైతిక చర్యలు చేపట్టడం చట్ట వ్యతిరేకమన్నారు. ప్రతిపక్ష నాయకులపై అసెంబ్లీలో చేపడుతున్న చర్యలు ప్రభుత్వ నియంతృత్వ పోకడకు నిదర్శనమని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జంగ స్వామి, మామిడాల భానుచందర్, రఘుపతిరెడ్డి, అంజయ్య, కాలేందర్, రాజు, కొండల్, శ్రీశైలం పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి : సీపీఎం

చీమలకొండూరులో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

భువనగిరి కలెక్టరేట్, మార్చి 15 : మండలంలోని చీమలకొండూరు గ్రామంలో నిరుపేదలకు సర్వే నెంబర్ 252లో 36 ప్లాట్లు ఇచ్చారని, వారందరికీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో ప్రజా సమస్యలను అధ్యయనం చేసి మాట్లాడారు. 1999లో ఆనాటి ప్రభుత్వం సర్వే నెంబర్ 252లోని రెండు ఎకరాల భూమిని 36మంది నిరుపేదలకు ఇండ్ల స్థలాల కోసం ఇచ్చిందన్నారు. ఆర్థిక స్థోమత లేక పేదలు ఇండ్లు కట్టుకోలేదని, ప్రభుత్వం రూ.15లక్షలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త కాలనీలో సీసీ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, శాఖ కార్యదర్శి బోడ ఆంజనేయులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

22కిలోల గంజాయి పట్టివేత

- ఐదుగురి అరెస్టు

గంజాయితో పట్టుబడిన నిందితులు

చౌటుప్పల్ రూరల్, మార్చి 14 : గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 22కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద శనివారం చౌటుప్పల్ పోలీసులు ఎస్ఓటీ టీమ్‌తో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు రెండు కార్లలో తరలిస్తున్న 22కిలోల గంజాయిని గుర్తించారు. నిందితులు రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రానుద్దీన్(32), సంతోష్‌నగర్‌కు చెందిన అబ్దుల్ ఆసిఫ్ (26), మోసిన్‌ఖాన్ (26), చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ అమీర్ (26), హబీబ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ (24)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ హేయమైన చర్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ శంకరయ్య

ఆలేరు టౌన్, మార్చి 15 : శాసన సభ సమావేశాల నుంచి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం హేయమైన చర్య అని మున్సిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రైతుల కష్టాలు తెలుసుకోకుండా, పంటలకు నీళ్లు సక్రమంగా ఇవ్వడం లేదని ప్రశ్నించినందుకు సస్పెండ్ చేయడం దుర్మార్గమని అన్నారు. అసెంబ్లీలో ఏం జరుగుతుందో.. ఎవరేం మాట్లాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. సస్పెన్షన్ ఎత్తివేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పత్తి వెంకటేశ్, నాయకులు పంతం కృష్ణ, ఆడెపు బాలస్వామి, పూల శ్రవణ్‌కుమార్, జూకంటి వెంకటేశ్ పాల్గొన్నారు.

కూలీల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : సీపీఎం